సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



..ఘరానా మోసం

ప్రభుత్వ పథకాల పేరుతో నెట్ సెంటర్‌ని ర్వాహకుడు ఘరానా మోసానికి తెరలేపాడు.

వివరాలు 8లో ▸



దక్షిణకాశీకి పోటెత్తారు

కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో అలంపూర్‌కు భక్తులు పోటెత్తారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 33.2 /22.5

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

గద్వాల అర్బన్: నిరుద్యోగ **యువతకు** ఉపాధి, శిక్షణ కల్పించుటకు ఈ **నెల 13న** (బుధవారం) జిల్లా కేంద్రంలోని **టీసీ స్టడీ** సర్కిల్ కార్యాయలంలో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి ప్రియాంక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, డీగ్రీ ఉత్తీర్ణతులైన 18–35ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన నిరుద్యోగులకు శిక్షణ అనంతరం కర్నూల్, గద్వాలలోని వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

అలంపూర్: సమన్వయంతో పనులు చేసి ప్రజలకు మెరుగైన సేవలందిద్దామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం కర్నూల్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీని వ్యవసాయ శాఖ అధికారులైన ఏడీఏ సక్రియానాయక్, ఏఓలు పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ అధికారులతో మాట్లాడి వ్యవసాయ శాఖ ద్వార చేపడుతున్న పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమస్యలు ఉంటే తమ వంతుగా పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో అనిత, సురేఖ, రాధ, సుబ్బారెడ్డి, అయూబ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు ఎమ్మెల్సీని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కందిపోయిన రైతు



అలంపూర్ శివారులో సాగు చేసిన కంది పంట

- తీవ్ర వర్షాభావ పరిస్థితులు.. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం
- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- జిల్లాలో 22,503 ఎకరాల్లో పంట సాగు

గద్వాల వ్యవసాయం: ఈ ఏడాది వానాకాలం సీజన్ కంది పంట సైతం రైతును తీవ్ర నిరాశ పర్చింది. కంది పంటను నడిగడ్డ రైతులు చాలా ఇష్టంగా సాగు చేస్తారు. కానీ, ఈసారి తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల వల్ల తీవ్రంగా దెబ్బతిని దిగుబడులు గణనీయంగా తగ్గాయి.

వర్షాభావం.. అధిక ఉష్ణోగ్రతలు

జిల్లాలో ఈసారి వానాకాలం సీజన్‌లో కంది పంటను 22,503 ఎకరాల్లో సాగు చేశారు. అయితే ఇందులో వర్షాధారం కింద, నీటి లభ్యత ఉన్న రెండు చోట్ల వేశారు. అయితే జూన్‌లో వర్షాలు ఆశించినంతగా వర్షాలు కురవలేదు. జులైలో పది రోజుల పాటు వర్షాలు కురిశాయి. ఆతర్వాత వరుణుడి జాడ లేకుండా పోయింది. వర్షాల మాట అటుంచితే పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదయ్యాయి. వర్షాకాలం ముగిసిన తర్వాత శీతాకాలంలో సైతం చలి తీవ్రత తక్కువగానే ఉండింది. ఇలా వాతావరణ పరిస్థితులు కంది పంటపై ప్రభావాన్ని చూపాయి. కంది పంట కాలం దాదాపు పూర్తి కావొస్తోంది. కోతలకు రైతులు సిద్ధం అవుతున్నారు. అయితే పంట దిగుబడులు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. వర్షాధారం కింద ఎకరాకు 3నుంచి 5 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, కేవలం రెండు నుంచి రెండున్నర క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. నీటి లభ్యత ఉన్న చోట 8నుంచి 10 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 5నుంచి 6 క్వింటాళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం దాదాపు పూర్తి కావస్తోందని, గింజలను బట్టి పంట దిగుబడులు గణనీయంగా తగ్గినట్లు అంచనాకు వచ్చామని రైతులు అంటున్నారు. వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు, తెగుళ్ల వల్ల పంట బాగా దిబ్బతిందని, ఎప్పుడు కంది పంట బాగానే చేతికి వచ్చేదని, కాని ఈసారి పంట ఆర్థికంగా నష్టాలు కలుగచేసిందని అన్నదాతలు వాపోతున్నారు.

జిల్లాలో కంది సాగు వివరాలిలా..

మండలం	సాగైంది (ఎకరాల్లో)
ఇటిక్యాల	4,927
వడ్డేపల్లి	2,963
ఉండవల్లి	2,839
అయిజ	2,658
గద్వాల	2,106
మానవపాడు	1,826
మల్దకల్	1,458
అలంపూర్	1,143
రాజోళి	1,129
గట్టు	608
ధరూర్	463
కేటీదొడ్డి	383

దిగుబడులు తగ్గాయి



మాకు ఉన్న పొలంలో మూడు ఎకరాలు కంది పంట వేశాను. వాతావరణంకు తోడు, తెగుళ్ల వల్ల పంట బాగా దెబ్బతింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. పెట్టుబడులు ఏటా పెరుగుతున్నాయి. పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– ధర్మన్న, రైతు, శేషంపల్లి, మల్దకల్ మండలం

నీటి లభ్యత ఉన్న చోట దిగుబడులు వచ్చాయి



ఈ సారి వానాకాలం సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు రాలేదు. దీనివల్ల వర్షాధారం కింద వేసిన అన్ని రకాల పంటలపై ప్రభావం పడింది. వర్షాధారం కింద వేసిన కంది పంట దిగుబడులు తగ్గాయి. అయితే బోర్లు, బావుల కింద వేసిన చోట దిగుబడులు బాగానే వస్తాయి.

– గోవిందునాయక్, డీఏఓ

నడిగడ్డలో కంది సాగు

ఆహార పంటలైన కంది పప్పుకు మార్కెట్‌లో ఎప్పుడు డిమాండ్‌తో మంచి ధరలు ఉంటాయి. కంది పంటను ఈ ప్రాంత రైతులు చాలా ఇష్టంగా సాగు చేస్తారు. వర్షాలు కొంత మేర వచ్చినా.. చలితో పంట బాగా వస్తుందని సాగు చేస్తుంటారు. దీనికితోడు పంటలో కొంత తినడానికి మిగుల్చుకొని, మిగిలినది విక్రయిస్తుంటారు. బోర్లు, బావులు ఉన్న రైతులతో పాటు, నీటి లభ్యత లేని రైతులు సైతం ఏటా వానాకాలం సీజన్‌లో కందిని వేస్తారు. కంది పంట సాగు చేయడానికి ఎకరాకు రూ.18వేల నుంచి రూ.20వేల వరకు ఖర్చు వస్తుంది. ఆరు నెలలు పంట కాలం. వాతావరణం సహకరిస్తే నీటి లభ్యత ఉన్న చోట 8నుంచి 10 క్వింటాళ్లు, వర్షాధారం కింద అయితే ఎకరాకు 3నుంచి 5 క్వింటాళ్లు పంట దిగుబడి వస్తుంది.

పీయూలో లా డిపార్ట్‌మెంట్



బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులకు ఆన్‌లైన్‌లో పీయూ ముఖద్వారాన్ని చూపిస్తున్న డీన్ వెంకటేశ్వర్లు

- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆన్‌లైన్ తనిఖీలు
- వీడియో కాల్ ద్వారా వసతులపై ఆరా తీసిన సభ్యులు
- న్యాయ విభాగం ఏర్పాటుతో కళాశాల మంజూరుపై చిగురిస్తున్న ఆశలు
- వనపర్తిలో ఎస్‌బీఎం లా కళాశాలకు అనుమతి ఇచ్చే అవకాశం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ప్రారంభం నుంచి సంప్రదాయ కోర్సులతో కొనసాగుతున్న క్రమంలో లా కళాశాల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో లా చదవాలనుకునే వాళ్లు హైదరాబాద్, వరంగల్, కర్నూలు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్లు పొందేవారు. అయితే త్వరలోనే మహబూబ్‌నగర్ జిల్లాలోనే లా చదువుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు యూనివర్సిటీలో లా డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అఫ్లియేషన్ పొందేందుకు సోమవారం ఆన్‌లైన్ తనిఖీలు జరిగాయి. వీలైనంత త్వరలో అనుమతులు వస్తే పీయూ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఏర్పాటు చేసేందుకు మార్గం సుగమమం కానున్నట్లు పీయూ అధికారులు చెబుతున్నారు.

వీడియో కాల్ ద్వారా..

పీయూలో లా డిపార్ట్‌మెంట్ ఏర్పాటు కోసం సోమవారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆన్‌లైన్ అఫ్లియేషన్ తనిఖీలు జరిగాయి. వీడియో కాల్ ద్వారా పీయూ ముఖద్వారం నుంచి ఎగ్జామినేషన్, అడ్మినిస్ట్రేషన్, లా డిపార్ట్‌మెంట్ విభాగం వంటి వాటిని కౌన్సిల్ సభ్యులు వీక్షించారు. ఆన్‌లైన్‌లో వారు అడిగిన ప్రశ్నలకు పీయూ లా డిపార్ట్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు, లా డిపార్ట్‌మెంట్ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ రాంప్రసాద్, పీయూ వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి సమాధానాలు చెప్పారు. ఇందులో పీయూ ఎప్పుడు ఏర్పాటైంది.. అందులో ఉన్న సదుపాయాలు.. సీసీ కెమెరాలు.. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. దీంతో వీలైనంత త్వరగా డిపార్ట్‌మెంట్ ఏర్పాటుకు అనుమతి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే నిజమైతే పీయూ ఏర్పడిన తర్వాత ఒక కీలక ఘట్టంగా లా కళాశాల ఏర్పాటును చెప్పుకోవచ్చు.

శుభపరిణామం..



పీయూలో లా డిపార్ట్‌మెంట్ ఏర్పాటు ఒక శుభపరిణామంగా భావిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ కూడా లా కళాశాల లేకపోవడంతో చాలామంది లా కళాశాల ఏర్పాటు కోసం ఎదురుచూస్తున్నారు. డిపార్ట్‌మెంట్ ఏర్పాటు అఫ్లియేషన్ తనిఖీలు జరిగాయి. పీయూలో లా, ఇంజినీరింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ల ఏర్పాటు కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపాం. డిపార్ట్‌మెంట్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో మరోసారి లా కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తాం. దీని ద్వారా పాలమూరులో లా విద్య అందుబాటులోకి రానుంది.

– లక్ష్మీకాంత్‌రాథోడ్, వీసీ, పాలమూరు యూనివర్సిటీ

అధికారుల ప్రయత్నాలు..

పీయూలో లా కళాశాల ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా యూనివర్సిటీ అధికారులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో లా డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం ఒక శుభపరిణామంగా వారు పేర్కొంటున్నారు. ఇక్కడ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో సులువుగా లా కళాశాలకు అనుమతులు వస్తాయి. డిపార్ట్‌మెంట్ ఏర్పడ్డాక ఇక్కడ కళాశాల భవనం, సిబ్బంది, లైబ్రరీ వంటి సదుపాయాలు కల్పిస్తే కళాశాలను యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ కళాశాలను కూడా స్థాపించేందుకు అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా వనపర్తి జిల్లాలో ఎస్‌బీఎం లా ఒక ప్రైవేటు లా కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు తెలుస్తుంది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతి వచ్చిన వెంటనే ఈ విద్యాసంవత్సరం నుంచి సంబంధిత కళాశాలలో అడ్మిషన్లు జరగనున్నట్లు వినికిడి. ఇందులో మొదటి సంవత్సరంలో ఏబీఎల్ఎల్‌బీకి 120 సీట్లు, ఎల్ఎల్‌బీకీ 40 సీట్లు కేటాయించే అవకాశం ఉంది.

కందనూలులో కలకలం

మాయలు, మంత్రాలతో బురిడీ కొట్టిస్తున్న మాయగాడు

- ఇప్పటికే 11 మందిని హత్య చేసినట్లు అనుమానాలు
- హైదరాబాద్‌లో జరిగిన ఓ ఘటనతో కదులుతున్న డొంక
- పోలీసుల అదుపులో మాయగాడు సత్యనారాయణ
- మూడేళ్ల క్రితం నాగాపూర్‌లో సంచలనం రేపిన నలుగురి మృతి
- ఈ ఘటన వెనుక కూడా ఇతడి హస్తమే ఉన్నట్లు సమాచారం
- గతంలోనే నిందితుడి బాగోతాలను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'

మాయలు, మంత్రాలు చేసి గుప్తనిధులను వెలికితీస్తానంటూ అమాయకులను నమ్మిస్తాడు.. మాటలతో పూర్తిగా మభ్యపెట్టి ఆస్తులు రాయించుకుంటాడు.. ఎవరైనా తన దారిలోకి రాలేదని అనుమానం వస్తే మట్టుబెట్టేందుకు సైతం వెనకాడడు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 11 మందిని హతమార్చాడు.. ఇలా మాయమాటలతో మొదలుపెట్టి.. హత్యలతో ముగింపు పలుకుతున్న సదరు మాయగాడి పాపం పండింది.. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపడుతుండటంతో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.. కందనూలులో కలకలం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలిలా..



నిందితుడు సత్యనారాయణయాదవ్ (ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్:

మాయలు, మంత్రాలు చేసి గుప్తనిధులను వెలికితీస్తానంటూ అమాయకులను మోసం చేస్తున్న మాయగాడు రామెట్టి సత్యనారాయణ యాదవ్ బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. తన దారికి రానందుకు ఏకంగా 11 మందిని హత్య చేసి పొట్టనబెట్టుకున్నాడని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు పదకొండు మంది అమాయకుల హత్యలో సత్యనారాయణకు ప్రమేయం ఉందని, పూర్తిస్థాయి విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. మాయగాడు సత్యనారాయణయాదవ్‌కు సంబంధించి పూర్తి వివరాలను పోలీస్ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

మహిళలపై లైంగిక వేధింపులు..

కుటుంబ సమస్యలు పరిష్కరిస్తానంటూ మహిళలను నమ్మిస్తూ వారిపై సత్యనారాయణయాదవ్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది. వంగూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ కొంతకాలంగా భర్తతో దూరంగా ఉంటుండగా.. వారి కుటుంబ సమస్యను మంత్రశక్తితో పరిష్కరిస్తానంటూ ఆమెకు చెందిన భూమిని సత్యనారాయణయాదవ్ తన అనుచరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. సత్యనారాయణయాదవ్ బాగోతాలపై ఏప్రిల్ 5న 'మాయగాళ్లు' శీర్షికన కథనం ద్వారా 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఇటీవల సత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకోగా ఇప్పటి వరకు కొనసాగిన హత్యోదంతం వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది.



సంచలనం రేపిన నాగాపూర్ ఘటన

వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగాపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తమ ఇంట్లోనే అపస్మారక స్థితిలో మరణించడం ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది. 2020 ఆగస్టు 14న ఘటన చోటుచేసుకోగా.. మూడేళ్ల పాటు పోలీసుల దర్యాప్తు కొనసాగింది. తాజాగా ఈ ఘటనకు సైతం సత్యనారాయణయాదవ్ కారకుడని పోలీసులు నిర్ధారించుకున్నట్టు తెలుస్తోంది. ఆ రోజు గుప్తనిధులను వెలికితీసేందుకు పూజలు చేసిన అనంతరం.. ఒకే ఇంట్లోని వేర్వేరు గదుల్లో నలుగురు మృతదేహాలు వెలుగులోకి వచ్చాయి. నాగాపూర్‌లోని ఒకే కుటుంబానికి చెందిన హజీరాబీ, ఆస్మా, ఖాజాపాషా, హాసీనా ఇంట్లో విగతజీవుల్లా కనిపించారు. వీరి మృతదేహాల పక్కన పూలు, కొబ్బరికాయ, అగరబత్తులు పడి ఉన్నాయి. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించి మూడేళ్లు గడిచినా వీరి మరణం వెనక మిస్టరీ వీడలేదు.

➡ తనకు మంత్రాలు తెలుసంటూ అమాయకులను మచ్చిక చేసుకోవడం, గుప్తనిధులను వెలికితీస్తానంటూ నమ్మిస్తూ సత్యనారాయణయాదవ్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మరో ఘటనలో నాగర్‌కర్నూల్ మండలం గన్యాగుల గ్రామానికి చెందిన రామస్వామి(50) 2022 నవంబర్ 17న వనపట్ల శివారులో దారుణ హత్యకు గురయ్యాడు. లింగస్వామి కుమారుడికి బ్యాంకులో ఉద్యోగం ఇప్పిస్తానని, ప్రతిఫలంగా ఆయనకు ఉన్న 130 గజాల ప్లాటును మార్టిగేజ్ చేయాలని నమ్మించాడని బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్లాటును మార్టిగేజ్ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న 10 రోజుల వ్యవధిలోనే రామస్వామి హత్యకు గురయ్యాడని బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే కోడేరు మండలం తీగలపల్లికి చెందిన రాంరెడ్డి, కల్వకుర్తి పట్టణంలో ఓ వ్యక్తి మరణంతో పాటు వీపనగండ్ల మండలానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి మిస్సింగ్ కేసుతోనూ సత్యనారాయణయాదవ్‌కు సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

నేడు జిల్లాకు మంత్రి జూపల్లి రాక

గద్వాల రూరల్: రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం గద్వాలకు రానున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించనున్నట్లు తెలిపారు.

గ్రీవెన్స్‌కు 13 అర్జీలు

గద్వాల క్రైం: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 13 ఫిర్యాదులు అందాయి. వివిధ మండలాలకు చెందిన వారు తమ గోడును ఏఎస్పీ రవి ఎదుట వెళ్లబోసుకున్నారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ.. సివిల్ సమస్యలను కోర్టు ద్వారా పరిష్కారం చేసుకోవాలని, మిగతా వాటిని విచారణ చేపట్టి పరిష్కరిస్తామని అన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

గద్వాల అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ముషాయిదా బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు జూనియర్ 10–16 సంవత్సరాల బాల బాలికలకు, సీనియర్స్ 17–35ఏళ్ల మధ్య స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని, పాల్గొనే దివ్యాంగులు జనన ధ్రువీకరణ పత్రం, ఏదేని ఐడికార్డు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా పరుగు పందెంలో పాల్గొనే వారు తప్పనిసరిగా ట్రై సైకిల్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని శారీరక, అంధ, మానసిక, దివ్యాంగులు, దివ్యాంగుల సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేరుశనగ క్వింటా రూ.8,140

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 2416 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.8,140, కనిష్టం రూ.3,829, సరాసరి రూ.5,600 ధరలు పలికాయి. అలాగే, 126 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ.5,436, కనిష్టం రూ.4820, సరాసరి రూ.5,402 ధరలు వచ్చాయి. 3136 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.3369, కనిష్టం రూ.1486, సరాసరి ధర రూ.2736 ధరలు పలికాయి. 607 క్వింటాళ్ల వరి (హంస) రాగా, గరిష్టం రూ.2123, కనిష్టం రూ.1820, సరాసరి రూ.1951 ధరలు వచ్చాయి. క్వింటాల్ కంది రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి రూ. 9516 ధర పలికింది.

రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ వల్లూరు క్రాంతి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: రాబోయో స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలకు అధికారులంతా సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంతకు ముందు ఆమె రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఎన్నికల సన్నద్ధతపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. ఈవీఎం, వీవీప్యాట్‌లు, ఇతర ఎన్నికల సామగ్రిని పూర్తిస్థాయిలో పరీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్‌జాబితా సవరణలో భాగంగా 2024 జనవరి 1వ తేదీ నాడు మార్పులు, చేర్పులు, తొలగింపు వంటి ప్రక్రియను ప్రణాళికబద్ధంగా చేపట్టాలన్నారు. ప్రధానంగా డబుల్ ఓటర్లు, వంద సంవత్సరాలు పైబడిన ఓటర్లు, మరణించిన ఓటర్లు వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కులం, ఆదాయం, ఇతర ధ్రువపత్రాలకు సంబంధించి ఎలాంటి పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని, ధరణికి సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి 45 ఫిర్యాదులు

వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వద్ద ఫిర్యాదుల స్వీకరించారు. మొత్తం 45ఫిర్యాదులు వచ్చినట్లు అందులో 30ధరణికి సంబంధించి, మిగిలినవి ఆసరా పింఛన్, విద్యా, వైద్యం, ఇరిగేషన్ వంటి సమస్యలపై వచ్చినట్లు తెలిపారు. వీటిని సంబంధించి శాఖల అధికారులకు పంపినట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులకు తప్పకుండా పరిష్కారం చూపాలని లేనిపక్షంలో అందుకు గల కారణాలు పేర్కొంటూ సంబంధిత ఫిర్యాదుదారునికి అక్‌నాలెడ్జ్‌మెంట్ పంపాలన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం



ఆస్పత్రి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: నూతనంగా నిర్మిస్తున్న 300పడకల ఆసుపత్రి, జిల్లా నూతన గ్రంథాలయ భవనాల పనులను వేగతవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన రెండు నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యతలో రాజీపడకుండా ఒప్పందం మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్, వైస్ చైర్మన్ బాబర్, కౌన్సిలర్లు శ్రీను, నాగిరెడ్డి, శ్రీనివాసులు, దౌలు, కృష్ణ, పార్టీ నాయకులు గోవిందు, ధర్మనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

గద్వాల క్రైం: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన గద్వాల మండలంలోని కొండపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తిమ్మప్ప (32) సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలంలోని బోర్ మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు షాక్ గురైయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్ తరిలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు..

మన్ననూర్: ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన సాయి (40) ఇరవై ఏళ్లుగా మన్ననూర్ గ్రామంలోని ఉమామహేశ్వర కాలనీకి చెందిన రామావత్ లాలు నాయక్ ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో వ్యవసాయ పొలం వద్దకు కాలినడకన వెళ్తున్నాడు. ఈ క్రమంలో శ్రీశైలం నుంచి మన్ననూర్ వైపు వస్తున్న అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గ్రామ శివారులో ఎదురుగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అమ్రాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను బైక్ ఢీకొని వ్యక్తి..

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. గద్వాల మండలం మర్లపల్లికి చెందిన కృష్ణ ఆదివారం రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండా, గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను దిమ్మెను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి సమీపంలో ఓ వ్యక్తి అనారోగ్యం కారణంగా పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మిడ్జిల్ మండలం వెలుగొమ్ముల గ్రామానికి చెందిన జర్పటి మల్లేష్(28) సోమవారం జడ్చర్ల పట్టణంలోని నిమ్మబాయిగడ్డ ప్రాంతంలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట అపస్మారక స్థితిలో కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే పక్కనే ఉన్న ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడు కొంత కాలంగా అనారోగ్యంగా ఉన్నాడని, పురుగు మందు తీసుకోవడంతో మృత్యువాత పడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు.

పిచ్చికుక్క దాడి.. 9 మందికి గాయాలు

మల్దకల్: మండల కేంద్రంలో పిచ్చికుక్క దాడి చేయడంతో 9 మంది గాయపడినట్లు డా. స్వరూపరాణి తెలిపారు. సోమవారం గ్రామంలో తిరుగుతున్న పిచ్చికుక్క దారి వెంట వెళ్లే అయిదుగురిని, పొలాల నుంచి ఇళ్లకు వస్తున్న నలుగురు రైతులపై దాడిచేసి గాయపర్చినట్లు వివరించారు. బాధిత కుటుంబ సభ్యులు కుక్కను చంపివేశారు. గాయపడిన వారికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందించారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

పెబ్బేరు రూరల్: రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెబ్బేరు పట్టణానికి చెందిన నాగరాల గొల్ల రాములు, ఆయన భార్య లక్ష్మి వ్యవసాయ పొలం నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా, ఆత్మకూర్ మండలం తూంపల్లికి చెందిన కొండన్న, బాలు బైక్‌పై పెబ్బేరు నుంచి వెళ్తూ పట్టణ శివారులో హైదరాబాద్ బైపాస్‌లో వీరు ఎదురెదురుగా ఢీకొన్నారు. నలుగురికి గాయాలు కాగా, వీరిలో బాలు పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

33 గొర్రెలు చోరీ

అడ్డాకుల: గొర్రెల మందపై గుర్తుతెలియని దుండగులు దాడిచేసి 33 గొర్రెలను ఎత్తుకెళ్లిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల మేరకు.. దేవరకద్ర మండలం జీన్గురాలకు చెందిన కెంచెలయ్య తన గొర్రెల మందను ఆదివారం రాత్రి పొన్నకల్ శివారులోని వ్యవసాయ పొలంలో నిలిపి అక్కడే నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు మందపై దాడిచేసి 33 గొర్రెలను ఎత్తుకెళ్లారు ఆలస్యంగా గుర్తించిన కెంచెలయ్య.. సోమవారం అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా శాఖాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గొర్రెల మందపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు దాడిచేసి, 30 గొర్రెలను ఎత్తుకెళ్లిన ఘటన మరువక ముందే పొన్నకల్ వద్ద గొర్రెలు చోరీకి కావడంతో కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పథకాల పేరుతో ఘరానా మోసం



అచ్చంపేటలోని ఇంటర్నెట్ సెంటర్ వద్ద గుమిగూడిన జనాలు

- అచ్చంపేటలో ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడి మాయాజాలం
- భరోసా కార్డు పేరుతో సొమ్ము చేసుకుంటున్న వైనం
- ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ పథకాల పేరుతో ఓ ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు ఘరానా మోసానికి తెర లేపాడు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నాడు. భరోసా కార్డు ఉంటేనే ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులవుతారని తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేస్తుండటంతో పేదల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. అయితే పథకాల అమలుపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాక ముందే కొందరు సొమ్ము చేసుకోవాలనే ఆలోచనలో పడ్డారు. అచ్చంపేట పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రి సమీపంలో ఉన్న లక్ష్మి కంప్యూటర్స్, సీఎస్‌సీ సెంటర్ నిర్వాహకుడు ఘరానా మోసానికి తెరలేపాడు. ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలను లబ్ధిదారులు పొందాలంటే భరోసా కార్డు కలిగి ఉండాలని తప్పుడు ప్రచారం మొదలుపెట్టాడు. భరోసా కార్డు కోసం వచ్చే ఒక్కొక్కరి నుంచి రూ.50 చొప్పున వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ విషయం చాలా మందికి తెలియడంతో ఇంటర్నెట్ సెంటర్ వద్ద బారులు తీరారు. మూడు రోజులుగా అమాయక ప్రజల నుంచి ఆరు గ్యారంటీ కార్డులకుగాను ఒక్కొక్కరి వద్ద రూ.300 చొప్పున వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని ప్రజలు అంటున్నారు.

గ్యాస్ ఏజెన్సీ వద్ద తగ్గని బారులు...

పట్టణంలోని లక్ష్మీప్రసన్న గ్యాస్ ఏజెన్సీ (భారత్ గ్యాస్) కార్యాలయంలో ఈ–కేవైసీ కోసం వినియోగదారులు బారులు తీరుతున్నారు. వచ్చేనెల నుంచి సిలిండర్ రూ.500లకే ఇస్తున్నారని తప్పుడు ప్రచారం జరగడంతో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం దాకా క్యూ కడుతున్నారు. అసలు విషయం చెప్పకుండా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు తప్పుడు ప్రచారం చేయడంతోనే లబ్ధిదారులు బారులు తీరుతున్నట్లు తెలిసింది. గ్రామాలకు వెళ్లి ఈ–కేవైసీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా ఏజెన్సీ నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. గ్యాస్ సిలిండర్ రవాణా పేరుతో రూ.20 నుంచి రూ.50 అదనంగా తీసుకుంటున్నా భరిస్తున్నామని.. ఈ–కేవైసీని మాత్రం గ్రామాలకు వచ్చి ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని.. ఏజెన్సీ నిర్వాహకులు చెప్పిందే వేదంగా నడుస్తోందన్నారు. అధికారులు అమ్యామ్యాలకు అలవాటు పడటంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక దృష్టి సారించాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.


అచ్చంపేట గ్యాస్ ఏజెన్సీ వద్ద బారులు తీరిన మహిళలు

తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు..


ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదు. తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దు. ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తాం. ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ప్రస్తుతం ఎన్నికల నిర్వాహణకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉన్నాం. సిబ్బంది కొరత కూడా ఉంది.

– గోపీరాం, ఆర్డీఓ, అచ్చంపేట

ఇటుక గోడ మృత్యుపాశమై..


కూలిన ఇటుక గోడ

- ఇద్దరు మహిళలు దుర్మరణం
- కర్నూలు జిల్లా కాల్వబుగ్గ ఇటుకల బట్టీలో దుర్ఘటన
- మృతులు ఉమ్మడి పాలమూరు జిల్లావాసులుగా గుర్తింపు


సునీతమ్మ (ఫైల్)


నందిని (ఫైల్)

ఓర్వకల్లు: బతుకుదెరువు కోసం పొట్ట చేత పట్టుకొని వలస వచ్చిన వారికి పాలిట ఇటుక గోడ మృత్యుపాశమైంది. నీటి తొట్టికి అమర్చిన ఇటుక గోడ కూలిపడడంతో అక్కడే ఉన్న ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ విషాద ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గ వద్ద గల ఇటుకల ఫ్యాక్టరీలో సోమవారం చోటుచేసుకోంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం జీడిగుట్ట తండాకు చెందిన 20 కుటుంబాలతో పాటు జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం సింధనూరు గ్రామానికి చెందిన మరో 20 కుటుంబాలు కాల్వబుగ్గ సమీపంలోని సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డికి చెందిన నెంబర్–1 లైట్‌వైట్ ఇటుకల ఫ్యాక్టరీలో ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నాయి. ఆయా కుటుంబాలకు చెందిన వారంతా 6 నెలలు ఇక్కడ పనిచేస్తే, మరో 6 నెలలు తమ సొంత గ్రామాల్లో పనిచేస్తూ జీవనం చేసేవారు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం పనుల్లోకి వచ్చారు. రోజు మాదిరిగానే ఉదయం వంట పనులు ముగించుకొని కాలకృత్యాలు తీర్చుకునేందుకు సమీపంలోని నీటితొట్టి వద్దకు వెళ్లారు. జీడిగుట్ట తండాకు చెందిన రాజు, రమజీల కుమార్తె నందిని(14) మొహం కడుక్కుంటుండగా, సింధనూరుకు చెందిన తిమోతి భార్య సునీతమ్మ(30) దుస్తులు ఉతుకుతోంది. ఆ సమయంలో ఒక్కసారిగా నీటి తొట్టికి అమర్చిన ఆరడుగుల ఇటుకల గోడ వారిపై పడటంతో తీవ్రగాయాలకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ యజమాని అక్కడికి చేరుకొని గాయపడిన ఇద్దరు మహిళలను తమ కారులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ఒకరు మృతి చెందారు. ఆసుపత్రిలో మరొకరు ప్రాణాలు వదిలారు. దీంతో సదరు యజమాని వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

రూ.5 లక్షల పరిహారం చెల్లించాలి

ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు మహిళలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని మృతుల కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించేదాక మృతదేహాలకు పోస్టుమార్టం చేయనివ్వమని పట్టుపట్టారు. దీంతో ఫ్యాక్టరీ యజమానికి, మృతుల బంధువులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోంది. పోలీసులు కల్పించుకొని ఇరువురికి సర్ది చెప్పారు.

నల్లమలలో పెద్ద పులుల సంచారం


అమరగిరి వద్ద కృష్ణానదిలో నీటి సమీపంలో ఉన్న పెద్దపులి

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఫారెస్ట్ రేంజర్ శరత్ చంద్రారెడ్డి

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ ప్రాంతంలోని నల్లమల అడవిలో పెద్ద పులుల సంచారం పెరిగిందని, కొల్లాపూర్, అమరగిరి, సోమశిల, ఎల్లూరు, మొలచింతలపల్లి పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్ర రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. మూడు రోజుల క్రితం అమరగిరి ప్రాంతంలో పెద్దపులి సంచరించిందని తెలిపారు. కృష్ణానదిని పెద్దపులి దాటుతున్నట్లు వీడియోలు ఉన్నాయన్నారు. రెండు నెలలుగా ఈ ప్రాంతంలో కృష్ణానదిని పెద్దపులులు దాటుతున్నట్లు తెలిసిందన్నారు. అనుమతులు లేకుండా అడవిలోకి వెళ్లడం నిషేధించినట్లు తెలిపారు. అమరగిరి వద్ద వీడియలో కనిపించిన పెద్దపులి గురించి ప్రత్యేకంగా రెండు టీంలను అడవిలో తిప్పుతున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో పులుల కదలికలు గురించి తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.

150 క్వింటాళ్ల నల్లబెల్లం నీటిలో పారబోత



అచ్చంపేట రూరల్: నిషేధిత నల్లబెల్లం సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. ఆరు నెలలుగా నిషేధిత నల్లబెల్లం పౌడర్‌ను సరఫరా చేస్తుండగా వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారని, జిల్లా అధికారులు ఆదేశాల మేరకు సోమవారం డిండి వాగులో ప్రవహిస్తున్న నీటిలో 150 క్వింటాళ్ల నల్లబెల్లం పౌడర్‌ను పారబోశామని తెలిపారు. నాటుసారా తయారీకి నల్లబెల్లంను వివిధమార్గాల ద్వారా తండాలు, ఇతర ప్రాంతాలకు చేర్చుతున్నారని, గట్టి నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్‌ఐలు బాల్‌రాజు, సతీష్, సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్, హాకీ జట్ల ఎంపిక


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ సుధీర్‌కుమార్‌రెడ్డి

వనపర్తిటౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలకృష్ణయ్య క్రీడా ప్రాంగణంలో అండర్–14 బాలికల ఫుట్‌బాల్, అండర్–17 బాలుర హాకీ జట్లను ఎంపిక చేశారు. ఫుట్‌బాల్ జట్టు ఎంపికకు 70మంది బాలికలు, హాకీ జట్టు సెలక్షన్స్‌కు 30మంది బాలుర క్రీడాకారులు హాజరైనట్లు జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలికల ఫుట్‌బాల్ పోటీలకు 18మంది, హాకీ పోటీలకు 18 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు క్రీడాకారులను పరిచయం చేసుకొని జట్ల ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ జనార్దన్‌గౌడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు సురేందర్ రెడ్డి, జితేందర్, గద్వాల డీవైఎస్‌ఓ ఆనంద్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల పరిశీలకుడిగా జగన్మోహన్‌గౌడ్



మహబూబ్‌నగర్ క్రీడలు: మేడ్చల్‌లోని కేఎల్ఆర్ మైదానంలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బాలబాలికల రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల పరిశీలకుడిగా జడ్చర్ల మండలం ఆలూరు జెడ్పీహెచ్ఎస్ పీఈటీ జగన్మోహన్‌గౌడ్ నియమితులయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల విభాగానికి ఆయన పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆయన వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర పరిశీలకుడిగా నియమితులు కావడంపై వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సినీఫక్కీలో చోరీ

- మహిళను కత్తితో బెదిరించి రూ.5.50లక్షలు అపహరణ


దుండగులు ధ్వంసం చేసిన బీరువా

మక్తల్: గుర్తు తెలియని దుండగులు సినీఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మక్తల్‌కు చెందిన కట్టెల మిషన్ అబ్దుల్ అమీద్‌కు చెందిన కొత్త ఇంటిని రెండు నెలల కిందట రూ.83 లక్షలకు సతీష్ అనే వ్యక్తికి విక్రయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.45లక్షలు ఇవ్వడంతో పాత టాకీస్ వద్దనున్న తన ఇంట్లో దాచిపెట్టారు. సోమవారం తన తమ్ముడి ఇంట్లో శుభకార్యం ఉండగా.. తన కూతురు బాలింత ఆఫ్రిన్‌ను ఇంట్లోనే ఉంచి మిగతా కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన ముగ్గురు దుండగులు.. మాస్క్ ధరించి ఇంటి వెనుకభాగం ఉన్న ద్వారం గుండా ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు ఇవ్వకుంటే చంపేస్తామని ఆఫ్రిన్‌ను కత్తితో బెదిరించగా.. ఆమె తాళాలు ఇవ్వకపోవడంతో బీరువాను పగులగొట్టారు. ఈ క్రమంలో ఆమె కేకలు వేయడంతో చేతికి అందిన నగదు తీసుకొని అక్కడి నుంచి పరారయ్యారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వెంటనే ఇంటికి చేరుకుని పరిశీలించారు. బీరువాలో రూ.45లక్షలు ఉండగా.. రూ.5.50లక్షలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పర్వతాలు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పట్టపగలే ఇంట్లో చోరీ కావడంతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు.

కబ్జా కోరులపై ఉక్కుపాదం


క్రిష్టియన్‌పల్లి శివారు ఆదర్శనగర్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న జేసీబీ

- పోలీసుల పర్యవేక్షణలో ఆక్రమణల కూల్చివేత
- రెవెన్యూ అధికారులతో వాగ్వాదం

మహబూబ్‌నగర్ రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వ భూమిని కబ్జా చేసుకొని అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారిపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎన్నికల హడావుడిలో అధికారులు ఉంటే కొందరు కబ్జాకోరులు గుట్టుచప్పుడు కాకుండా తమ పని కానిచ్చేశారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండలం క్రిష్టియన్‌పల్లి గ్రామ రెవెన్యూ శివారు ఆదర్శనగర్‌లో గల 523 సర్వే నంబర్‌లో పలు అక్రమ నిర్మాణాలు చోటు చేసుకున్నాయి. గత పాలకుల అండదండలతో ప్రభుత్వ భూమిని కొంతమంది దర్జాగా కబ్జా చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేత చేపట్టారు. పోలీసు బందోబస్తులో ఆదర్శనగర్‌కు చేరుకున్న రెవెన్యూ అధికారులు జేసీబీలతో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ఆక్రమణదారులు రెవెన్యూ అధికారులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. పోలీసు బందోబస్తు ఉన్న కారణంగా కూల్చివేతలు శరవేగంగా జరిగాయి. తహసీల్దార్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో గిర్దావర్లు చైతన్య, నర్సింగ్ తదితరులు కూల్చివేతలను పర్యవేక్షించారు.


ఆదర్శనగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జేసీబీ

కాంగ్రెస్ వైపు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ల చూపు?

- వచ్చే నెలలో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి యోచన!
- ఇదే విషయమై 'హస్తం' నేతలను కలిసి చెప్పిన వైనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీఆర్‌ఎస్‌కు చెందిన స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో మహబూబ్ నగర్ ఎమ్మెల్యేగా యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గెలుపొందడంతో వారు ఇటు వైపు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ మున్సిపాలిటీలో మొత్తం 49 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో 2019 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో 41 మంది బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) నుంచి, నలుగురు ఎంఐఎం నుంచి, ముగ్గురు బీజేపీ నుంచి, ఒకరు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. అయితే రెండేళ్ల క్రితం వివిధ కారణాలతో అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో విభేదించిన 43వ వార్డు కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే ఇటీవలి శాసనసభ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు 39వ వార్డు కౌన్సిలర్ బి.రమాదేవి, 21వ వార్డు కౌన్సిలర్ ఆనంద్‌గౌడ్, 15వ వార్డు కౌన్సిలర్ డి.లతాశ్రీ, 29వ వార్డు కౌన్సిలర్ మహమూద్ అలీ 'హస్తం' గూటిలోకి వెళ్లారు. అయితే ఈ నాలుగేళ్ల కాలంలో స్థానికంగా తాము ఎలాంటి పనులు చేయలేకపోయామనే భావనతో బీఆర్‌ఎస్ నేతలపై మెజారిటీ కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలు 2024 చివరలో జరగనుండటంతో అసంతృప్త కౌన్సిలర్లు ఎలాగైనా పార్టీ మారాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు తాజాగా సోమవారం జిల్లాకేంద్రంలోని ఓ రహస్య ప్రదేశంలో 10 నుంచి 15 మంది వరకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమావేశమై నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి ప్రస్తుత కౌన్సిల్ వచ్చే నెల 28వ తేదీతో నాలుగేళ్లు పూర్తవుతుంది. ఆ తర్వాత ఏ క్షణమైనా మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని, అందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఇప్పటికే కాంగ్రెస్ నేతలను కలిసి వారు హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ఓ ముఖ్య నేత చక్రం తిప్పుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

- వేరుశనగలో కాండం కుళ్లు తెగులు
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి


కాండం కుళ్లు తెగులు ఆశించిన వేరుశనగ పంట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పప్పుశనగ సాగు తగ్గింది. యాసంగిలో రెండవ పంటగా బోరుబావులు, సాగునీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రైతులు వేరుశనగ సాగుచేశారు. ప్రస్తుతం వేరుశనగ పంటకు కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ఏడీఏ సక్రియ నాయక్ చెబుతున్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలని రైతులకు సూచిస్తున్నారు. కాండం కుళ్లు తెగులు ఆశించి తీవ్ర నష్టాలను కలిగించే అవకాశం ఉంటుందని, కాండం కుళ్లు ఆస్పర్ జిల్లస్ అనే శిలీంధ్రం వల్ల ఆశిస్తున్నట్లు పేర్కొంటున్నారు. ఈ శిలీంధ్రాలు మొక్క కణాలు, భూమిలో ఉంటాయని తెలిపారు. ఈ కణాలను కొనిడియా అని పిలుస్తారని.. గింజ నుంచి మొలక వచ్చిన వెంటనే భూమికి దగ్గరగా ఉండే కాండానికి ఆశిస్తుందని చెప్పారు. కాండంపై నల్లటి రంగు లేదా గోదుమ రంగు మచ్చలు ఏర్పడి అక్కడ అంత తెల్లటి బూజు లాంటి పదార్థం తయారై మొక్క చనిపోతుందని తెలిపారు. మూడు దశల్లో తెగుళ్లు వాపిస్తాయని వివరించారు. గింజ భూమిలో ఉన్నప్పుడు, మొక్క మొలకెత్తిన 20నుంచి 25 రోజుల్లో తెగులు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా మొక్క 60 నుంచి 65 రోజుల్లో ఉన్న సమయంలో కాండం కుళ్లు తెగులు ఆశిస్తుందని తెలిపారు.

నివారణ..

కాండం తెగులు ఆశించిన పంటకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి, కార్బండిజమ్, మాంకోజెబ్ గ్రాము లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్ల తడిచేటట్లు వారానికి రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

క్లుప్తంగా...

కొత్తగా 850 ఎంబీబీఎస్ సీట్లు



వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి..

సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏపీలో మరో 850 వైద్య సీట్లను అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఐదు నూతన వైద్య కళాశాలలను ప్రారంభించడం ద్వారా 750 సీట్లను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2024–25 విద్యా సంవత్సరం నుంచి పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఐదు చోట్ల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడంతో పాటు, వైద్య కళాశాలలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 3,530 పోస్టులను మంజూరు చేశారు. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఒక్కోచోట 150 చొప్పున 750 సీట్ల కోసం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కు దరఖాస్తు చేశారు. మరోవైపు అనంతపురం వైద్య కళాశాలలో 50, నెల్లూరు, శ్రీకాకుళం కళాశాలల్లో ఒక్కో చోట 25 చొప్పున 50 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం అనంతపురంలో 150, శ్రీకాకుళంలో 175, నెల్లూరులో 175 సీట్లున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

జీతాలతోపాటు అలవెన్సుల చెల్లింపు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలతోపాటు అలవెన్సులు కూడా కలిపి చెల్లించాలని నిర్ణయించింది. 'పే ఇన్ టు'లో డ్యూటీ బేస్డ్ అలవెన్సులను జీతాలతోపాటు కలిపి చెల్లించనుంది. వచ్చే నెల నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఓవర్ టైమ్ అలవెన్సులను జీతాలతో పాటు చెల్లించనున్నారు. దాంతో దాదాపు 50వేలమంది ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2017 పీఆర్సీ బకాయిలు, ఎస్ఆర్‌బీఎస్ ట్రస్ట్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా త్వరలోనే దశలవారీగా చెల్లించాలని నిర్ణయించింది. అలాగే క్రమశిక్షణ చర్యలపై ఆర్టీసీ ఉద్యోగులు అప్పీల్ చేసేందుకు.. తదనంతరం సత్వరం పరిష్కరించేలా విధి విధానాలను రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిపై రూపొందించిన ముసాయిదాను న్యాయశాఖ పరిశీలనకు పంపారు. త్వరలోనే క్రమశిక్షణ చర్యలపై ప్రత్యేకంగా అప్పీళ్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయనుంది.

సామాజిక న్యాయంతో | కొత్త సమన్వయకర్తలు

- 11 నియోజకవర్గాలకు కొత్తవారిని నియమించిన సీఎం జగన్
- మంగళగిరిలో ఆళ్ల స్థానంలో సమన్వయకర్తగా గంజి చిరంజీవి
- గాజువాకలో దేవన్‌రెడ్డి స్థానంలో బీసీ వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావు
- గుంటూరు పశ్చిమ సమన్వయకర్తగా మంత్రి విడదల రజని
- చిలకలూరిపేట సమన్వయకర్తగా మల్లెల రాజేష్‌నాయుడు

ముగ్గురు మంత్రులకు స్థానచలనం



ఆదిమూలపు సురేష్ (కొండేపి)



మేరుగు నాగార్జున (సంతనూతలపాడు)



విడదల రజని (గుంటూరు పశ్చిమ)

సాక్షి, అమరావతి: సామాజిక న్యాయం అనేది నినాదం కాదు.. అనుసరించాల్సిన విధానమని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి చాటిచెప్పారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చి రాజ్యాధికారంలో వాటా కల్పించి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పిన సీఎం జగన్ తాజాగా 11 నియోజకవర్గాలకు నూతన సమన్వయకర్తల నియామకంలోనూ అదే విధానాన్ని పాటించారు. ప్రస్తుతం అగ్రవర్ణాలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించారు. మంత్రులు విడదల రజని, మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను మార్పు చేశారు.

మరింత మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సీఎం వైఎస్ జగన్ సమాయత్తం చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులను శాస్త్రీయంగా, క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ మార్పుచేర్పులు చేస్తున్నారు. ఈ క్రమంలో 11 నియజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా చేనేత సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవిని సీఎం జగన్ నియమించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కుమారుడు, నియోజకవర్గ సమన్వయర్త దేవన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావును నియమించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజినిని నియమించారు. ఆమె ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్తగా కాపు సామాజిక వర్గానికి చెందిన మల్లెల రాజేష్‌నాయుడిని నియమించారు.

కొత్త సమన్వయకర్తలు వీరే..

1.ప్రత్తిపాడు(ఎస్సీ)– బాలసాని కిరణ్‌కుమార్
2.కొండెపి(ఎస్సీ) – డాక్టర్ ఆదిమూలపు సురేష్
3.వేమూరు(ఎస్సీ) – వరికూటి అశోక్‌బాబు
4.తాడికొండ(ఎస్సీ) – మేకతోటి సుచరిత
5.సంతనూతలపాడు(ఎస్సీ) – డాక్టర్ మేరుగు నాగార్జున
6.చిలకలూరిపేట – మల్లెల రాజేష్‌నాయుడు
7.గుంటూరు పశ్చిమ – విడదల రజిని
8.అద్దంకి – పాణెం హనిమిరెడ్డి
9.మంగళగిరి – గంజి చిరంజీవి
10.రేపల్లె – డాక్టర్ ఈవూరు గణేష్
11.గాజువాక – వరికూటి రామచంద్రరావు

వ్యక్తిగత కారణాలతోనే రాజకీయాలకు ఎమ్మెల్యే ఆర్కే దూరం

సీఎం వైఎస్ జగన్ వెంటే రామకృష్ణారెడ్డి: ఎంపీ అయోధ్య రామిరెడ్డి



సాక్షి, అమరావతి/మంగళగిరి: తన సోదరుడు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పదవికి, పార్టీకి ఆర్కే రాజీనామా చేయడంపై ఆయన స్పందించారు. ఆర్కేకు ఎలాంటి అసంతృప్తి లేదని, సీఎం జగన్ వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్కేకు కొన్ని అంచనాలు ఉన్నాయని, వాటిని అందుకోలేక రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని వివరించారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సీఎం జగన్ మొదటి నుంచి భావించారని, ఆ క్రమంలోనే సమన్వయకర్తగా గంజి చిరంజీవిని నియమించారని చెప్పారు.

వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా: ఆర్కే



తాను వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. ఆయన సోమవారం అసెంబ్లీకి వెళ్లి స్పీకర్ ఓఎస్డీకి రాజీనామా అందించిన అనంతరం మంగళగిరిలో విలేకరులతో మాట్లాడారు. 1995 నుంచి రాజకీయాలలో ఉంటూ దివంగత వైఎస్సార్ అనుచరుడిగా కొనసాగానన్నారు. 2004, 2009లలో కాంగ్రెస్ నుంచి పెదకూరపాడు టిక్కెట్ ఆశించి భంగపడ్డానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచి 2014, 2019లలో మంగళగిరి ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దానని చెప్పారు.

మెరుగైన ఫలితాల కోసమే మార్పులు

11 నియోజక వర్గాలకు కొత్త సమన్వయకర్తల నియామకంపై మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల

సాక్షి, అమరావతి: ఏపీలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా ఏ నియోజక వర్గానికి ఎవరిని పార్టీ సమన్వయకర్త(ఇన్‌ఛార్జ్)గా నియమించాలో శాస్త్రీయంగా అధ్యయనం చేసిన అనంతరం మార్పులు చేర్పులకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఆ వివరాలను ప్రకటించారు. మంగళవారం నుంచి 11 నియోజవర్గాల్లో పార్టీ వ్యవహారాలన్నీ కొత్తగా నియమితులైన సమన్వయకర్తలే పర్యవేక్షిస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మెరుగైన ఫలితాల కోసమే ఈ మార్పులని, భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చని వారు స్పష్టం చేశారు. బొత్స మాట్లాడుతూ.. ఏ ఒక్కరినీ పార్టీ వదులుకోదని, అందరి సేవలను వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. గత నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ వారికి ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చారన్నారు. సామాజిక సాధికారతను చేతల్లో చూపించారన్నారు. అణగారిన వర్గాలకు మరింతగా మంచి చేయాలంటే పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. భవిష్యత్తులోనూ అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితులను సమీక్షించుకుంటూ అవసరాన్ని బట్టి ఇన్‌ఛార్జ్‌ల మార్పు చేర్పులపై తగిన నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. గంజి చిరంజీవిని పార్టీలో చేర్పించింది మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డేనని మంత్రి బొత్స గుర్తు చేశారు. మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వకర్తగా చిరంజీవిని సీఎం జగన్ నియమించారన్నారు. పార్టీలో ఆళ్ల రామకృష్ణారెడ్డికి సముచిత స్థానం ఇస్తారని చెప్పారు. పార్టీ ఏ ఒక్కరినీ వదులుకోబోదని, ఎవరి సేవలు ఎక్కడ అవసరమో అక్కడ వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఈ మార్పుల వల్ల కొందరికి బాధ ఉండవచ్చని, అయితే అందరూ సీఎం జగన్ నిర్ణయాలను అర్థం చేసుకుని పార్టీకి సహకరిస్తారన్నారు. సజ్జల మాట్లాడుతూ.. "సీఎం జగన్ వైఎస్సార్‌సీపీని స్థాపించిన నాటి నుంచి పార్టీని ప్రజలకు జవాబుదారీగా ఉంచారు.
సీఎం జగన్ దృష్టిలో శాసనసభ్యుడికి ఎంత విలువ ఉంటుందో కార్యకర్తకూ అంతే విలువ ఉంటుంది. ప్రజలతో మమేకమై వారి మనసులు చూరగొని ఆశీస్సులు పొంది ఎవరు రాణిస్తారో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని సీఎం జగన్ మొదటి నుంచి చెబుతున్నారు. ఈ క్రమంలోనే 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. భారీ మెజార్టీతో గెలవాలన్న ఆలోచనతోనే మార్పులు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చు.. ఉండకపోవచ్చు కూడా! పార్టీ ఒక వ్యక్తి కోసమో.. వ్యక్తుల కోసమో ఉండదు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే కూర్చోబెట్టి మాట్లాడతాం. ఎందుకు మార్పు చేశామనేది అంతర్గతంగా వారికి వివరిస్తాం" అని పేర్కొన్నారు.

రంగస్థలానికి పూర్వ వైభవం

- 23 నుంచి గుంటూరులో ఏపీ 'నంది నాటకోత్సవాలు'
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి



సాక్షి, అమరావతి: తెలుగు నాటక రంగ స్థలానికి పూర్వవైభవం తీసుకొచ్చే సంకల్పంతో గుంటూరులో ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు '22వ నంది నాటకోత్సవాల'ను నిర్వహిస్తున్నట్లు ఏపీ చలన చిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. సోమవారం విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, నాటికలు, బాలల నాటిక, కళాశాల /వర్సిటీ నాటిక (ప్లేలెట్స్)కు 115 ఎంట్రీలు వచ్చాయన్నారు. వీటిల్లో ప్రాథమిక పరిశీలన అనంతరం 38 ప్రదర్శనలను తుది పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఐదు విభాగాల్లో 74 అవార్డులను అందజేయనున్నట్లు పోసాని వివరించారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకు నాటక ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. ఐదు విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతుల కోసం జరిగే పోటీల్లో ఒక్కోదానిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారని తెలిపారు. దీంతో పాటు 2022లో నాటక రంగంపై 'ఉత్తమ రచన గ్రంథం'ఎంపిక కోసం మరో ముగ్గురు జడ్జిలతో కమిటీని నియమించామన్నారు.

నామినేషన్లకు గడువు పొడిగింపు

ప్రభుత్వం నాటక రంగ విస్తరణకు ఎనలేని ప్రోత్సాహం అందిస్తోందన్నారు. నంది నాటకోత్సవాల వేదికపై 'ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం'పేరుతో నాటక రంగంలో వ్యక్తిగత విభాగంలో విశేష సేవలందించిన నటులు, కళాకారులకు రూ.1.50 లక్షల నగదు బహుమతిని ప్రదానం చేస్తోందన్నారు. దీంతో పాటు సమష్టి కృషితో పనిచేసిన నాటక సమాజాలకు, పరిషత్తులను ప్రోత్సహించేందుకు తొలిసారిగా వైఎస్సార్ రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేస్తూ.. రూ.5లక్షల బహుమతి, మెమెంటోతో సత్కరిస్తామన్నారు. ఈ అవార్డుల నామినేషన్ల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి బాలలు, కళాశాల విద్యార్థి నాటకాల విభాగాల్లోనూ వ్యక్తిగత బహుమతులను అందజేస్తామన్నారు.

నెట్టెంపాడు ఎత్తిపోతలకు నీటి పంపింగ్



ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను కొనసాగిస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం 6గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 1,994 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 67, ఎడమ కాల్వకు 325, కుడి కాల్వకు 401 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 325, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 350, కుడి కాల్వ ద్వారా 10, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

దక్షిణకాశీకి పోటెత్తిన భక్తులు

- కార్తీక చివరి సోమవారంతో తరలివచ్చిన భక్తజనం
- ఆలయంలో రుద్రహోమాలు



బాలబ్రహ్మేశ్వర ఆలయంలో కార్తీక దీపాలంకరణ



రుద్రహోమాలు చేస్తున్న భక్తులు



అలంపూర్ ఆలయంలో భక్తుల రద్దీ

జోగుళాంబ శక్తిపీఠం: కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో అలంపూర్ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి దాక భక్తులు పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే ఉసిరి చెట్ల దగ్గర కుటుంబ సభ్యులతో కలిసి కార్తీక వనభోజనాలు చేశారు. బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు జరిపారు. మాస శివరాత్రి కూడా కలిసిరావడంతో బాలబ్రహ్మేశ్వరస్వామివారి యాగశాలలో భక్తులు రుద్రహోమాలు చేశారు. రుద్రహోమాలు చేయడం వల్ల ఐశ్వర్యం, ఆరోగ్యం కలుగుతుందని, అపమృత్యు బాధలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆలయంలో కార్తీక దీపాలు

అలంపూర్‌లోని పుణ్యక్షేత్రాలు వైష్ణవ, శాక్తేయ శైవ క్షేత్రాలు కావడంతో కార్తీక చివరి సోమవారం రోజు శైవ, వైష్ణవ సంప్రదాయాలకు దర్పణం పట్టేలా ఆయా నామాలతో కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో బ్రహ్మేశ్వరుడి గర్భాలయం బంగారు వర్ణంలో కాంతులీనింది. ప్రదోశ కాలతో దశవిధ హారతులు ఇచ్చి.. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు బ్రహ్మేశ్వర నిత్యాన్నదాన సత్రంలో భోజన సదుపాయాలు కల్పించారు.

సందర్శించిన ఐజీ త్రివిక్రమ్‌వర్మ

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను ఐజీ త్రివిక్రమవర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తీర్థ, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.

కురుమూర్తి కొండల్లో గోవింద నామస్మరణ

జాతరకు తరలి వస్తున్న భక్తులు



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: కురుమూర్తి కొండలలో సోమవారం గోవింద నామస్మరణ మారుమోగింది. కురుమూర్తి జాతరను పురస్కరించుకొని సోమవారం స్వామివారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు క్యూలైన్లో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం మెట్లపైన, స్వామివారి పాదుకల వద్ద, ఆలయ సన్నిధిలో దీపాలు వెలిగించారు. కొండదిగువన దాసంగాలు పెట్టి, గండదీపాలు మోశారు. కొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అలివేలుమంగమ్మ, ఉద్దాల మండపం, ఆంజనేయ, చెన్నకేశవస్వామి ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది సౌకర్యాలు కల్పించారు.



జాతర మైదానంలో భక్తుల రద్దీ

లారెక్కిన.. పడవ



బండ్లు ఓడలవుతాయి.. ఓడలు బండ్లవుతాయంటే ఇదేనేమో.. సాధారణంగా లారీలను నది దాటించాలంటే వాటిని పడవల్లో ఎక్కించి తీసుకెళ్తారు. అదే పడవలను ఎక్కడికైనా తీసుకెళ్లాలంటే లారీల్లో తరలిస్తారు. ఓ భారీ పడవను ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోని నుంచి అమరావతికి తరలిస్తున్నారు. సోమవారం అడ్డాకుల సమీపంలో జాతీయ రహదారిపై పడవను తీసుకెళ్తుండగా వాహనదారులు ఆసక్తిగా ఆసక్తిగా తిలకించారు. – అడ్డాకుల

టచ్ సంస్థను సందర్శించిన పీయూ విద్యార్థులు



సంస్థ ప్రతినిధులతో విద్యార్థులు, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని టచ్ స్వచ్ఛంద సంస్థను పీయూ ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా సందర్శించారు. ఈ మేరకు సంస్థ డైరెక్టర్ వినయ్‌కుమార్ సంస్థ నిర్వహణ, విద్యార్థుల చదువులు, సేవలు వంటి అంశాలపై వివరించారు. ప్రతి ఒక్కరు తప్పకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నైపుణ్యం పెంచుకోవాలన్నారు. ఆరోగ్యకర సమాజం ఏర్పడాలంటే వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం పెరగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఓడీ పర్వతాలు, మాధురి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ -14 విజేత జట్టుకు అభినందనలు

గద్వాల అర్బన్: వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్–14 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా స్థాయిలో జోగుళాంబ గద్వాల జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో డీవైఎస్ఓ ఆనంద్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, వ్యాయమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, హైమవతి, ఫుట్‌బాల్ కోచ్ విజయ్ క్రీడకారులను అభినందించారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో పోల్గొననున్నారని తెలిపారు.



విజేతగా నిలిచిన జిల్లా జట్టుతో డీవైఎస్ఓ ఆనంద్, వ్యాయామ ఉపాధ్యాయులు

జడ్చర్ల సీఐకి రూ.10వేలు జరిమానా

సాక్షి, హైదరాబాద్: ఫిర్యాదు అందినా ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యం చేసినందుకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సీఐ రమేశ్‌బాబుకు హైకోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని రెండు వారాల్లోగా లీగల్ సర్వీసెస్ అథారిటీలో డిపాజిట్ చేయాలని ఆదేశించింది. పిటిషన్‌లో తదుపరి విచారణను కూడా రెండు వారాలకు వాయిదా వేసింది. వివిధ సెక్షన్ల కింద నేరాలకు పాల్పడిన కె.శ్యామ్‌కుమార్, వెంకటేశ్‌గౌడ్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశించినా సీఐ నమోదు చేయకపోవడంతో జడ్చర్ల మండలం బాదేపల్లి గ్రామానికి చెందిన గోల్కొండ ప్రతిభ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి.. విధి నిర్వహణలో అలసత్వం వహించినందుకు జరిమానా విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.